TELANGANA POLITRICKS

www.vishalabharati.com
epaper:vishalabharati.com

# పాలిట్రిక్స్
2023-2024

విశాల భారతి
vishalabharathi Telugu Daily

గురువారం, 23.11.2023 హైదరాబాద్
1pm edition




పాలిట్రిక్స్



# ఉప్పు, నిప్పు కలిసిపోయాయి..

- కాంగ్రెస్ నేతల మధ్య కుదిరిన సయోధ్య..
- ఒక్కటైన జంగా రాఘవరెడ్డి, నాయిని రాజేందర్‌రెడ్డి
- రాఘవరెడ్డికి డీసీసీ ప్రెసిడెంట్‌తో పాటు ఎమ్మెల్సీ!

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

ఉప్పు నిప్పు కలిసిపోయాయి. అసమ్మతి గళం మూగబోయింది. నిత్యం వివాదాలతో రగిలిపోయే ఆ ఇద్దరు నేతలు ఒక్కటయ్యారు. విభేదాలు పక్కనబెట్టి గెలుపే లక్ష్యంగా ముందుకు నడుస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఇంతకు ఆ నియోజకవర్గం ఏంటీ? అసమ్మతి నేతకు హైకమాండ్ ఇచ్చిన ఆఫర్ ఏంటీ?

కాంగ్రెస్ పార్టీ అసమ్మతి వర్గాలను బుజ్జగిస్తూ ఎన్నికల్లో జోరుపెంచింది. ఇదే క్రమంలో వరంగల్ జిల్లాలో ఉప్పునిప్పుగా ఉన్న జంగా రాఘవరెడ్డి, నాయిని రాజేందర్‌రెడ్డి మధ్య సయోధ్య కుదిర్చింది. మొన్నటి వరకూ వరంగల్ పశ్చిమ నియోజకవర్గం సీటు విషయంలో ఇద్దరి నేతల మధ్య నువ్వా నేనా అట్లు సాగింది వ్యవహారం. పోలింగ్ తేదీ దగ్గరపడుతుండడంతో కాంగ్రెస్ అగ్రనేతలు, జిల్లా పార్టీ నేతలు కలిసి నాయిని రాజేందర్ రెడ్డి - జంగా రాఘవరెడ్డి మధ్య వైరం సద్ధుమణిచారు. చివరకు తన డిమాండ్లకు ఓకే చెప్పడంతో అనుచరులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో జిల్లా పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు జంగా రాఘవరెడ్డి. అక్కడే ఉన్న నాయిని రాజేందర్ రెడ్డిని ఆలింగనం చేసుకున్నారు.. ఒకరినొకరు పలకరించుకొని ఒక్కటేనని ప్రకటించారు. కాంగ్రెస్ ను కలికట్టుగా గెలిపిస్తామని ప్రకటించారు జంగా రాఘవరెడ్డి. నాయిని రాజేందర్ రెడ్డి గెలుపు కోసం నిస్వార్థంగా పనిచేస్తానని స్పష్టం చేశారు .అయితే నాయిని రాజేందర్ రెడ్డికి వరంగల్ పశ్చిమ టికెట్ కేటాయించినందుకు గాను.. జంగా రాఘవరెడ్డికి డీసీసీ ప్రెసిడెంట్ బాధ్యతలతో పాటు, ఎమ్మెల్సీ పదవి ఇవ్వడానికి ఒప్పుకున్నట్లు చెప్పారు జంగా రాఘవరెడ్డి. తన గెలుపు కోసం సహకరిస్తానని ప్రకటించిన జంగా రాఘవరెడ్డి, ఆయన వర్గానికి నాయిని రాజేందర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. జంగా రాఘవరెడ్డికి సముచిత స్థానం హైకమాండ్ కల్పిస్తుందని రాజేందర్‌రెడ్డి చెప్పారు. అయితే, మనసు మార్చుకున్న జంగా రాఘవరెడ్డి సహకరిస్తారా..? లేక ఎడమొఖం పెడముఖంగానే ఉంటారా..? లేక ఆయన చెప్పినట్లే వరంగల్ జిల్లాలో 5స్థానాల్లో గెలుపునకు కృషి చేస్తారనన్న మాటను నిలబెట్టుకుంటారా? చూడాలి.




# ఎలక్షన్ వార్.. రెడ్ అలర్ట్..!

- పరస్పర దాడులతో రాష్ట్రవ్యాప్తంగా టెన్షన్!
- కత్తిపోట్లు, రాళ్లదాడులతో పీక్‌స్టేజీకి..
- కొన్ని చోట్ల కిడ్నాప్‌లు ప్రలోభాల పర్వం
- డిసెంబర్9 తర్వాత మీ అంతుచూస్తా..
- ఏసీపీకి పీసీసీ చీఫ్‌రేవంత్‌రెడ్డి వార్నింగ్

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

మాటల తూటాలు దాటి.. భౌతిక దాడులకు చేరింది తెలంగాణ దంగల్. మెదక్ ఎంపీపై కొత్త ప్రభాకర్‌రెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు చుట్టూ నడిచిన కత్తిపోట్ల ఎపిసోడ్.. మిగతా ప్రాంతాలక్కూడా పాకింది. మంథని, సూర్యాపేట, బోధన్, భువనగిరి.. ఇలా అనేక చోట్ల రోడ్ల మీద బాహాబాహీకి దిగి, కత్తులు, కటార్లకు పని చెబుతున్నారు నేతలు. అటు.. నయానో, భయానో లొంగదీసుకునేందుకు కొన్నిచోట్ల కిడ్నాప్‌లు, ప్రలోభాల పర్వం కూడా పీక్స్‌లో నడుస్తోంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో భౌతిక దాడుల సీజన్ కొనసాగుతోంది. మహాముత్తారం మండలం కిష్టాపూర్ వద్ద కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు పరస్పర దాడులకు దిగారు. మాజీ నక్సలైట్, కాంగ్రెస్ నేత సిరికొండ బక్కన్న, జడ్పీటీసీ మాజీ సభ్యుడు రాజిరెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. బక్కన్న కాంగ్రెస్ అభ్యర్థి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అనుచరుడు. దాడికి పాల్పడింది పుట్టా మధు అనుచరులే అంటూ ఆరోపించారు కాంగ్రెస్ నేతలు. అయితే, మాజీ నక్సలైట్లను కాంగ్రెస్‌లో చేర్చుకుంటూ తమ నాయకులపై దాడులకు ఉసి గొల్పుతున్నారని ఆరోపించారు పుట్టా మధు. ఇదే విషయంలో మంథనిలో కార్యకర్తలతో కలిసి ర్యాలీగా రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేశారు ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు. గుండా రాజకీయం మొదలు పెట్టారంటూ ఇరు వర్గాలు ఆరోపించుకోవడంతో ఎవరు ఎవరిపై దాడి చేశారన్నది అయోమయంగా మారింది. ఇక, సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ నియోజకవర్గంలో కిడ్నాప్ రాజకీయాలు నడుస్తున్నాయి. తమ ఎన్నికల ప్రతినిధులను బలవంతంగా కిడ్నాప్ చేశారంటూ ఎమ్మెల్యే సైదిరెడ్డిపై కంప్లయింట్ చేశారు కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిచ, ఎంపీ ఉత్తమ్ కుమార్ రెడ్డి. చాణక్య సంస్థతో తాము ఎన్నికల నిర్వహణకు సంబంధించి అవగాహన చేసుకున్నమని, వారిని సైదిరెడ్డి బలవంతంగా కారులో ఎక్కించుకుని తనకు అనుకూలంగా పనిచేయాలని బెదిరించారని ఆరోపించారు ఉత్తమ్. కార్యకర్తలతో కలిసి పోలీస్ స్టేషన్ ఎదుట బైటాయించారు. కానీ.. ఓడిపోతానని భయం పట్టుకుంది గనుకే ఉత్తమ్ దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నారని ఎమ్మెల్యే సైదిరెడ్డి ఆరోపించారు.

అటు నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలంలో ఎమ్మెల్యే షకీల్‌కు నిరసన సెగ తగిలింది. ఆయన ఎన్నికల ప్రచారాన్ని అడ్డుకుని బీఆర్ఎస్ కార్యకర్తలతో ఘర్షణకు దిగారు జైతాపూర్ గ్రామస్థులు. అభివృద్ధిపై స్థానికులు నిలదీయడంతో వివాదం చెలరేగినట్టు తెలుస్తోంది. కాంగ్రెస్ ప్రోద్భలంతోనే తమపై దాడికి పాల్పడ్డారని ధ్వజమెత్తారు ఎమ్మెల్యే షకీల్ అనుచరులు. మరోవైపు బోధన్ నియోజకవర్గంలో లాఠీచార్జ్ ఘటనపై పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి సీరియస్ అయ్యారు. 'బీఆర్ఎస్ కార్యకర్తలా వ్యవహరిస్తున్నావ్.. డిసెంబర్ 9 తర్వాత నీ సంగతి చూస్తా' అంటూ ఏసీపీకి వార్నింగ్ ఇచ్చారు.



# ఎక్కడో తేడా కొడుతోంది బాస్!

- డైలమాలో బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్
- గత రెండు ఎన్నికల కంటే భిన్నంగా ప్రచారం
- కాంగ్రెస్ ను బూచీగా చూపి ప్రజలను భయపెట్టే యత్నం
- 'హస్తం' ఆరు గ్యారంటీలతో పెద్దసారు గుండెల్లో గుబులు
- మరికొన్ని హామీలిచ్చేందుకు రెడీ అవుతున్నట్లు సమాచారం

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

ఈసారి ఎన్నికల్లో ప్రత్యర్థి కాంగ్రెస్ బలంగా పోటీ ఇస్తుండటంతో.. బీఆర్ఎస్ బాస్ చాలా జాగ్రత్తగా అడుగులు వేస్తున్నారు. బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ కొంత డైలమాలో పడ్డట్టే కనిపిస్తోంది. గత రెండు ఎన్నికల కంటే భిన్నంగా ఆయన కదలికలు కనిపిస్తున్నాయి. గత ఎన్నికలను ఈసారి అంతలా సీరియస్ గా కేసీఆర్ తీసుకోలేదు. క్షేత్రస్థాయిలో పరిస్థితి ఎలా ఉందో ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారు. ఎక్కడైనా సమస్య ఉంది అని భావిస్తే.. అక్కడ ఎక్కువ ఫోకస్ పెట్టి.. ఆయా అభ్యర్థులకు కొన్ని సూచనలు చేస్తున్నారు. 2014లో తెలంగాణ రాష్ట్రం వచ్చిన సెంటిమెంట్ తో నెట్టుకొచ్చారు. అప్పట్లో టీడీపీ, వైసీపీ ఓట్లు చీలిపోవడంతో నాడు తనకు నష్టం జరిగిందని కేసీఆర్ చాలా సందర్భాల్లో చెప్పారు. దీనికి కారణంగానే ఫస్ట్ టర్మ్‌లో అంచనాకు మించి సీట్లు దక్కలేదని పార్టీ నేతల ముందు అప్పట్లో చెప్పుకొచ్చారు.

**ఆ ఓటర్లే లక్ష్యంగా ప్రచారం**

మొదటిసారి వచ్చిన ఫలితాల నేపథ్యంలో ఆయన రెండోసారి కొంత అలర్ట్ అయ్యారు. లోక్‌సభ ఎన్నికలతో పాటు వెళ్తే జాతీయ పార్టీల ప్రభావం ఉంటుందని భావించిన కేసీఆర్ ఒక ఏడాది ముందుగానే ఎన్నికలకు వెళ్లి విజయం సాధించారు. అంతకుముందు ఎన్నికలకంటే అధిక స్థానాలను సాధించుకున్నారు. అయితే 2023 ఎన్నికలకు పడుతున్న టెన్షన్ ఆనాడు పడలేదు. ఇన్ని హామీలు కూడా అప్పుడు ఇవ్వలేదు. బంగారు తెలంగాణ తెస్తానని మాత్రమే అప్పటో ప్రచారం చేశారు. తన సర్వేలలో చేయించుకుని ఫలితాలు రావడంతో టెన్షన్ పడలేదు.




అంచనాలకు తగ్గట్లుగానే 2018 ఎన్నికల్లో భారీ సీట్లు సాధించి విపక్షాలకు ఝలక్ ఇవ్వగలిగారు. బీఆర్ఎస్ లెక్కల ప్రకారం.. ప్రభుత్వ పథకాలు పొందుతున్న వారంతా తిరిగి బీఆర్ఎస్‌కే ఓటు వేస్తారు. అలాగే తటస్థంగా ఉండేవారిని ఆకర్షిస్తే, వారి ఓట్లు కూడా బీఆర్ఎస్‌కి పడతాయనే అంచనాలో ఆ పార్టీ నేతలున్నారు. ఇక అసంతృప్తిగా ఉన్న వారిని ఆకట్టుకోవడం ద్వారా ఓట్ల సంఖ్యను పెంచుకోవాలని గులాబీ బాస్ సూచిస్తున్నట్లు తెలిసింది.

**ప్రభుత్వంపై అసంతృప్తి**

కానీ ఈసారి మాత్రం ఎక్కడో తేడా కొడుతుంది. గతంలో ఇచ్చిన హామీలు అమలుపర్చకపోవడం, కొన్ని వర్గాల్లో నెలకొన్న అసంతృప్తి పార్టీపైనా, ప్రభుత్వంపైన అసంతృప్తి ఉందని గులాబీ బాస్ పసిగట్టారు. పథకాలు ప్రజలకు చేరేందుకు ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు అవినీతి పాల్పడ్డ సంఘటనలు అనేకం వెలుగులోకి వచ్చాయి. అలాగే రేషన్ కార్డులు, ఆసరా, పింఛన్లు, కల్యాణ లక్ష్మి, దళిత బంధు పథకాలకు ఎమ్మెల్యేలు సూచించిన వారికే ఆ పథకాలు అందాయి. స్థానికి నేతలు ప్రతి పనికి కమీషన్లు తీసుకుంటుండడం లాంటి కారణాలు ఈసారి బీఆర్ఎస్ ముందటికాళ్లకు బంధం కానుంది. ఇప్పటికే 70కి పైగా శాసనసభ నియోజవకర్గాల్లో ప్రచారాన్ని పూర్తి చేసుకున్నారు. ప్రచారం ముగిసే సమయంలోగా మరొక 30 నియోజకవర్గాలను పర్యటించాలన్న లక్ష్యంగా కాళ్లకు బలపాలు కట్టుకొని తిరుగుతున్నారు కేసీఆర్. సారుకు కూడా ఎక్కడో డౌట్ కొడుతోంది. గతానికి భిన్నంగా ఈసారి ఎన్నికలకు ఎవరిని నమ్మక తానే ప్రచారంలోకి దిగడం సారు ఉన్న భయాన్ని తెలియజేస్తుంది. ఇటీవల ఓ సభలలో స్వయంగా సీఎం కాంగ్రెస్ పార్టీపై విరుచుకుపడుతున్నారు. తెలంగాణ రాకముందు విషయాలను చెబుతూ.. మరోసారి తెలంగాణ సెంటిమెంట్ ను తట్టిలేపుతున్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలతో ప్రజల ముందుకు వేగంగా దూసుకు రావడంతో కేసీఆర్ చాలా వరకూ అలర్ట్‌అయినట్లే కనిపిస్తోంది. మరోసారి సెంటిమెంట్ తో పాటు కాంగ్రెస్ వస్తే ఏం జరుగుతుందో చెబుతూ ప్రజలను భయపెట్టే ప్రయత్నం చేయడం ఇందుకు తార్కారణంగా నిలుస్తోంది.



### కాంగ్రెస్ కు కొంత ఎడ్జ్ ఉందని తెలిసి..

కాంగ్రెస్ ప్రకటించిన పథకాలకు కాపీ కొడుతూ.. ఇప్పటికే మ్యానిఫేస్టోను విడుదల చేసిన కేసీఆర్ కాంగ్రెస్ పార్టీ ఆదరణను తగ్గించేందుకు మరికొన్ని వరాలను ప్రకటించాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఈ నెల 25వ తేదీన పరేడ్ గ్రౌండ్స్ లో జరగబోయే సభలో కొత్త హామీలతో జనం ముందుకు రావడానికి సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. అది ఏరకమైన హామీలన్నది తెలియకున్నా కాంగ్రెస్ కు కొంత ఎడ్జ్ ఉందని తెలిసిన తర్వాతనే చివరి ప్రయత్నంలో కేసీఆర్ మరికొన్ని హామీలను ఇచ్చేందుకు సిద్ధమువుతున్నారని సొంత పార్టీ నేతలు చెబుతున్నారు. పార్టీ ఎమ్మెల్యేలపై వ్యతిరేకత కూడా ఈసారి ఇబ్బంది పెడుతుందేమోనన్న అనుమానం కేసీఆర్ వారి మదిలో తొలుస్తోంది. అందుకే పార్టీలోని కల్వకుంట్ల కుటుంబ నేతలు(కేసీఆర్, కేటీఆర్, కవిత, హరీష్)లు రాష్ట్రంలో ప్రచారంలో నిమగ్నమయ్యారు. ఎక్కడికక్కడ కాంగ్రెస్ పార్టీపై తమ అసహనాన్ని వెల్లగక్కుతున్నారు. కానీ ప్రజలు మాత్రం ఆచితూచి వ్యవహరిస్తున్నారు. తమ నిర్ణయాన్ని నవంబర్ 30నే తెలుపుతామని తెగేసి చెబుతున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ వేవ్ నడుస్తుందని దాని దెబ్బకు కారు గల్లంతు కావడం దాదాపు ఖాయంగా కనిపిస్తుందని పొలిటికల్ అనలిస్టులు అంచనా వేస్తున్నారు.

# గెలుపు కోసం సామ దాన భేద దండోపాయాలు!

- ఓటర్లను ప్రసన్నం చేసుకోవడంపై పార్టీల ఫోకస్
- రహస్య మిత్రులుగా బీఆర్ఎస్, బీజేపీ వ్యూహాలు
- కాంగ్రెస్‌అభ్యర్థుల ఆర్థిక మూలాల కట్టడి..
- భారీగా డబ్బు పంచేలా బీఆర్ఎస్‌ప్లాన్!




### ఓటర్లకు డబ్బు పంపిణీ

విపక్షనేతలకు ఎన్నికల ఖర్చులకు అప్పుకూడా దొరకకుండా ఫైనాన్షియర్లపై బెదిరింపులకు పాల్పడిన అధికారపార్టీ అభ్యర్థులు, నాయకులు.. మాత్రం ఓటర్లకు డబ్బు పంపిణీకి ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేశారన్న చర్చ సర్వత్రా జరుగుతోంది. పోలింగ్ తేదీ దగ్గర పడిన కొద్దీ ఓటుకు మూడు నుంచి ఐదు వేల వరకూ పంచేసినా ఆశ్చర్యం లేదని పరిశీలకులు అంచనా వేస్తున్నారు. ఇప్పటి వరకూ జరిగిన అన్ని ఎన్నికలు ఒక ఎత్తు.. ఇప్పుడు జరుగబోయే ఎన్నికలు ఒక ఎత్తు అన్నట్టు భవిష్యత్తులో చెప్పుకొనే పరిస్థితి వస్తుందని పేర్కొంటున్నారు. అంత ఖరీదైన ఎన్నికలుగా ఇవి రికార్డు సృష్టించే అవకాశాలు లేకపోలేదని అంటున్నారు.

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పెట్టుకున్న అధికార బీఆర్ఎస్, ఈసారి ఎలాగైనా అధికారంలోకి రావాలని కష్టపడుతున్న కాంగ్రెస్ ప్రచారంలో దూసుకుపోతున్నాయి. నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగియడంతో పోటీలో ఉన్న అభ్యర్థులెవరో ఇప్పటికే ఓ స్పష్టత వచ్చింది. దీంతో ఎన్నికల ప్రచారంతో పాటు బలాల సమీకరణ, ఓటర్లను ప్రసన్నం చేసుకోవడంపై పార్టీలు ఫోకస్ పెట్టాయి. గెలుపు కోసం రాజకీయ పార్టీలు సామ, దాన, భేద, దండోపాయాలు ఉపయోగిస్తున్నారు. ఇందులో అధికార బీఆరెస్ ముందు వరుసలో ఉందని రాజకీయ పరిశీలకులు అంటున్నారు.

**బీఆర్ఎస్ మాస్టర్ ప్లాన్**

బీఆర్ఎస్ నుంచి చాలా మంది కీలక నేతలు కాంగ్రెస్‌లోకి వెళ్లారు. ఇదే తీరుగా కారుపార్టీ, బీజేపీ నుంచి బడా నేతలు కొందరు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకొని అసెంబ్లీ ఎన్నికల్లో బరిలోకి దిగారు. మొన్నటివరకు 3వ స్థానంలో ఉందనుకున్న కాంగ్రెస్ ఇప్పుడు అధికార పార్టీకి ఆల్టర్నేట్‌గా మారింది. బలపడుతుందనుకున్న బీజేపీ బలహీన పడి నామమాత్రపు పార్టీగా మిలిగింది. అయినప్పటికీ 30 స్థానాల్లో అభ్యర్థుల గెలుపుపై బీజేపీ ప్రభావం చూపే అవకాశం ఉంది. సరిగ్గా ఇక్కడే బీఆరెస్ గెలుపు కోసం మాస్టర్ ప్లాన్ వేసిందన్న చర్చ రాజకీయ వర్గాలలో జరుగుతోంది. శత్రువుకు శత్రువు తనకు మిత్రుడనే సామెతను బీఆరెస్ అందిపుచ్చుకుందని, కాంగ్రెస్ గెలుపును అడ్డుకోవాలంటే ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీల్చడంతో పాటు సాధ్యమైనంత మేరకు రహస్య మిత్రుడిని కాపాడుకునే ప్రయత్నంలో బీజేపీ ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. ఈ మేరకు బీజేపీ 111 స్థానాల్లో, మిత్రపక్షం జనసేన 8 స్థానాల్లో పోటీ చేయనున్నది.




**బీజేపీ ఏజెంట్లుగా గులాబీ శ్రేణులు**

మొత్తంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలలో క్యాడర్ లేకున్నా బీజేపీ జనసేన కూటమి కలిసి పోటీ చేస్తున్నాయి. బీజేపీకి అనేక నియోజక వర్గాల్లో బూత్ కమిటీలలో కూర్చోవడానికి ఏజెంట్లు కూడా లేని పరిస్థితి ఉందన్నచర్చ జరుగుతోంది. దీనిని అవకాశంగా తీసుకున్న అధికార బీఆర్ఎస్ అనేక చోట్ల తన మనుషులనే గ్రామ స్థాయిలో బీజేపీ నేతల వద్దకు పంపించి, బూత్ కమిటీలలో నియామకం అయ్యేలా చేశారన్న వాదనలు వినిపిస్తున్నాయి. రాష్ట్రంలో అనేక నియోజక వర్గాలలో ఇదే పరిస్థితి ఉందన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

**ప్రత్యర్థులకు అప్పులు పుట్టకుండా కుట్రలు**

ఎన్నికలన్నాక ఖర్చులు ఉంటాయి. అయితే.. కనీస ఖర్చులు కూడా పెట్టుకోలేని విధంగా ప్రత్యర్థి పార్టీలను అధికార కారుపార్టీ కట్టడి చేస్తున్నదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికార బీఆరెస్ పార్టీ అభ్యర్థులు నయానో, భయానో బెదిరించి ప్రత్యర్థులకు అప్పులు పుట్టకుండా అడ్డుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కాంగ్రెస్ ను ప్రధాన పోటీదారుగా భావిస్తున్న అధికార పార్టీ.. ఇటీవల పలు జిల్లాల్లో ఆ పార్టీ అభ్యర్థులకు అప్పులు ఇవ్వకుండా ఫైనాన్షియర్లను బెదించినట్లు పలువురు కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. ఒకరిద్దరు అప్పుగా ఇస్తామని హామీ ఇచ్చారని, అయితే వాళ్లను అధికార పార్టీ అభ్యర్థి ఒకరు బెదిరించారని కొందరు చెప్పుకొచ్చారు.